ఉన్నత విద్య.. మిథ్య!

- ఉర్దూ డిగ్రీ కళాశాల ఏర్పాటు ఎప్పుడో?
- ఇంటర్ తర్వాత ఆపేస్తున్న విద్యార్థులు
- కాలేజీ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి


ప్రొద్దుటూరులోని ఉర్దూ జూనియర్ కళాశాల

ప్రొద్దుటూరు కల్చరల్ : జిల్లాలో కడప తరువాత ఎక్కువ మంది ముస్లింలు ప్రొద్దుటూరు పట్టణంలో ఉన్నారు. ఇక్కడ వనరులను దృష్టిలో ఉంచుకుని చుట్టుపక్కల నియోజకవర్గాలకు చెందిన ముస్లింలు ప్రొద్దుటూరుతో అనుబంధం ఉంది. ప్రొద్దుటూరులో దాదాపు 60 వేల ముస్లిం జనాభా ఉంది. ముస్లిం విద్యార్థుల కోసం 10 ఉర్దూ ప్రాథమిక పాఠశాలలు, 3 ఉర్దూ ఉన్నత పాఠశాలలు, 3 ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. ఒక ఉర్దూ జూనియర్ కళాశాల కూడా ఉంది. ఆ పై ఉన్నత విద్యను అభ్యసించాలంటే ఉర్దూ మీడియంలో ఉన్నత కళాశాలలు లేవు. దీంతో ఉన్నత విద్య అభ్యసించాలన్న ఆసక్తి ఉన్నా తగిన కళాశాలలు లేకపోవడంతో ఉర్దూ విద్యార్థులు అర్ధాంతరంగా చదువు మానేస్తున్నారు. ప్రొద్దుటూరు ఉర్దూ జూనియర్ కళాశాలకు పట్టణంతో పాటు ఎర్రగుంట్ల, జమ్మలమడుగు, రాజుపాళెం, చాపాడు తదితర ప్రాంతాల నుంచి ఉర్దూ మీడియంలో 10వ తరగతి పాసైన విద్యార్థులు చదువుకోవడానికి వస్తున్నారు. వీరిలో చాలామంది ఇంటర్ పూర్తయ్యాక డిగ్రీ చదవడానికి అవకాశం లేక చదువు ఆపేస్తున్నారు. కొందరు విద్యార్థులు విద్యపై ఆసక్తితో ఇంగ్లీషుమీడియం, తెలుగు మీడియంలో కొనసాగుతున్నారు.

మాటలకే పరిమితమైన ఉర్దూ డిగ్రీకళాశాల ఏర్పాటు

ప్రభుత్వం ఉర్దూను రెండవ అధికార భాషగా గుర్తించినా భాషాభివృద్ధికి అవసరమైన సౌకర్యాలను కల్పించలేదు, చిన్న పట్టణమైన మైదుకూరులో ఉర్దూ లైబ్రరీ, ఉర్దూ కంప్యూటర్ సెంటర్‌లు ఉండగా ప్రొద్దుటూరులో ఉర్దూ లైబ్రరీ లేకపోవడం గమనార్హం. 2017–18 విద్యాసంవత్సరంలో టీడీపీ ప్రభుత్వంలో ఉర్దూ డిగ్రీకళాశాల ఏర్పాటు చేస్తామని ఉన్నత విద్యాశాఖాధికారులు ప్రకటించారు. ఆ మేరకు ఎస్‌సీఎస్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో మైనారిటీ నాయకులతో సమావేశం నిర్వహించి త్వరలో తరగతులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అయితే అధికారుల ప్రకటన కార్యరూపం దాల్చలేదు. ఉర్దూ డిగ్రీకళాశాల ఏర్పాటు కాలేదు. ప్రభుత్వాలు మారిన ఉర్దూ డిగ్రీకళాశాల ఏర్పాటు కావడం లేదని ఉర్దూ భాషాభివృద్ధిపై పాలకులకు చిన్నచూపు తగదని.. ఇప్పటికైనా పట్టణంలో ఉర్దూ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని ముస్లిం మైనారిటీ ప్రజలు, విద్యార్థులు కొరుతున్నారు. ఇటీవల పట్టణంలో పర్యటించిన మైనారిటీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారుడు ఎంఏ షరీఫ్‌కు పట్టణంలో ఉర్దూ డిగ్రీకళాశాల ఏర్పాటు చేయాలని పలువురు ముస్లిం నాయకులు వినతి పత్రం అందించారు.

ఉర్దూ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలి



ముస్లిం విద్యార్థులు ఈ ప్రాంతంలో అధికంగా ఉన్నారు. ఉర్దూ డిగ్రీకళాశాలను ఏర్పాటు చేస్తే ఉర్దూ విద్యార్థులకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. అధికారులు ఉర్దూ డిగ్రీకళాశాలను ఏర్పాటుకు చర్యలు చేపట్టాలి.

– నాసిర్, ఉర్దూ ఇంటర్ కళాశాల ఎంపీసీ విద్యార్థి, ప్రొద్దుటూరు

ఇంటర్‌తోనే చదువు మానేస్తున్నారు



ఉర్దూ మీడియం ఇంటర్ పూర్తవగానే డిగ్రీ కళాశాల పట్టణంలో ఉర్దూ డిగ్రీకళాశాల లేకపోవడంతో చాలా మంది విద్యార్థులు చదువు మానేస్తున్నారు. డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేసి మైనారిటీ విద్యార్థుల ఉన్నత చదువుకు ప్రభుత్వం కృషి చేయాలి.

–మున్నా, హెచ్‌ఈసీ విద్యార్థి, ప్రొద్దుటూరు

పట్టుదలతో చదివితే ఉత్తమ ఫలితం


పది పరీక్షలపై విద్యార్థులకు సూచనలిస్తున్న ఏబీసీడబ్ల్యూఓ జ్యోతి

బద్వేలు అర్బన్ : నమ్మకం, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని కడప డివిజన్ అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ బి.జ్యోతి తెలిపారు. స్థానిక సిద్దవటం రోడ్డులోని బీసీ బాలుర వసతిగృహంలోని పది విద్యార్థులకు ఆదివారం ప్రేరణ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలకు గడువు దగ్గర పడుతున్న నేపథ్యంలో సమయం వృథా చేసుకోకుండా కష్టపడి చదవాలని సూచించారు. శిక్షణ తరగతుల్లో సూచించిన మెళకువలను పాటిస్తూ ప్రతి సబ్జెక్టులో నైపుణ్యాన్ని మెరుగుపరచుకుని పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. చదువుకు పేద, ధనిక అనే భేదం లేదని, పట్టుదలతో చదివి తల్లిదండ్రులకు, హాస్టల్‌కు మంచిపేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో వసతిగృహం సంక్షేమాధికారి నాగదాసరిప్రసాద్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వెంకటసుబ్బయ్య, నరసింహులు, రత్నం, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రీన్ హైవే పనులకు అడ్డుకట్ట


మల్లేపల్లె వద్ద నిమ్మ చెట్లకు కమ్ముకున్న మట్టి

బ్రహ్మంగారిమఠం : దుమ్ముతో తమ పంటలు నష్టపోతున్నామని చెబుతూ మండలం లోని మల్లేపల్లెలో జరుగుతున్న గ్రీన్ హైవే రోడ్డు పనులు రైతుల అడ్డుకున్నారు. హైవే వద్దకు చేరుకుని ఆదివారం పనులు నిలిపివేయించారు. రైతుల వివరాల మేరకు.. వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు మేకల రత్నకుమార్‌యాదవ్‌కు చెందిన 600, మరింతమంది రైతులకు చెందిన దాదాపు 300 సన్న నిమ్మచెట్లు గ్రీన్‌హైవే రోడ్డుకు సమీపంలో ఉన్నాయి. ఇటీవల హైవే విస్తరణ పనుల కోసం అధిక సంఖ్యలో టిప్పర్లతో మట్టిని తరలిస్తున్నారు. ఈ దుమ్ము, ధూళికి తాము సాగు చేసిన సన్న నిమ్మ పంట దిగుబడులు రావడంలేదని రత్నకుమార్ యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. దుమ్ము నివారణా చర్యలు చేపట్టాలని కాంట్రాక్టర్ ప్రతినిధులకు చెబుతున్నా స్పందించడం లేదన్నారు. దాదాపు రూ.6 లక్షలు నష్టపోయే అవకాశం ఉందని, అందుకే రైతులతో కలిసి పనులు నిలిపివేయించామని తెలిపారు.

ల్యాపరోస్కోపిక్, టెస్ట్‌ట్యూబ్ బేబి సెంటర్ ప్రారంభం


వైద్యులు జయలక్ష్మి, అరవింద్‌తో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని గాంధీరోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన విశ్వ ల్యాపరోస్కోపిక్, టెస్ట్‌ట్యూబ్ బేబి సెంటర్‌ను ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు, వైద్యులు డాక్టర్ జయలక్ష్మి, కె అరవింద్ మాట్లాడుతూ టెస్ట్‌ట్యూబ్ బేబీ సెంటర్‌లో సంతానం లేక బాధపడుతున్న దంపతులకు మెరుగైన చికిత్స అందిస్తామన్నారు. ప్రొద్దుటూరు ప్రజలతో పాటు పరిసర ప్రాంత ప్రజలు తమ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని పలువురు వైద్యులు, ప్రముఖులు పాల్గొన్నారు.

12న మాతంగ మహర్షి జయంతి

జయప్రదం చేయాలని దండు వీరయ్య మాదిగ పిలుపు


మాట్లాడుతున్న ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండువీరయ్య మాదిగ

ప్రొద్దుటూరు కల్చరల్ : శ్రీమాతంగ మహర్షి, సంత్ రవిదాస్ జయంతి వేడుకలను ఒంటిమిట్టలోని జాంబవంతుని 50 అడుగుల విగ్రహం ప్రాంగణంలో ఈనెల 12న ఉదయం 11 గంటలకు ఘనంగా నిర్వహించనున్నట్లు ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండువీరయ్య మాదిగ తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆంధ్ర భద్రాద్రిగా పేరుగాంచిన ఒంటిమిట్టలో శ్రీమాతంగ మహర్షి, శ్రీసంత్ రవిదాస్ జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జాంబవంతుని మహాసంస్థానం ఏర్పాటు చేయాలని, ఒంటిమిట్టకు ఏకశిల నగరంగా నామకరణం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆది జాంబవ ధర్మరక్ష సమితి ప్రాంత ప్రముఖ్ నాగభూషణం మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాలలక్ష్మయ్య మాదిగ, ప్రొద్దుటూరు మండల అధ్యక్షుడు చాపాటి మనోహర్ మాదిగ, బాలనరసింహులు మాదిగ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల్లో అరుదైన వ్యక్తి రామకృష్ణారెడ్డి


సన్మానసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గోవిందరెడ్డి

పోరుమామిళ్ల : ఉపాధ్యాయుల్లో అరుదైన వ్యక్తి ముత్తుముల రామకృష్ణారెడ్డి అని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి ప్రసంశించారు. ఆదివారం మండలంలోని రామేశ్వరం ఎంపీపీ పాఠశాలలో ఎంఈఓ బాలఅంకిరెడ్డి అధ్యక్షతన జరిగిన రామకృష్ణారెడ్డి పదవీ విరమణ సన్మాన సభలో ఎమ్మెల్సీ మాట్లాడారు. ఆయన్ను జిల్లా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు వరించాయన్నారు. సన్మానసభలో పాల్గొన్న ఫుడ్ కమిషన్ చైర్మెన్ చిత్తా విజయప్రతాప్ రెడ్డి, మాజీ ప్రభుత్వ సలహాదారు నాగార్జునరెడ్డి, యువనేత ఆదిత్యారెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి, ఎస్టీయు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఇలియాస్‌బాషా, సంగమేశ్వర్‌రెడ్డి, పి.రమణారెడ్డి, మాజీ ఏపీసీ అంబవరం ప్రభాకర్‌రెడ్డి, సీమ్యాట్ అధికారి సతీష్‌రెడ్డి, ఏఎంఓ వీరేంద్ర తదితరులు పాల్గొని సన్మానించారు.

ఆలయ హుండీని పగులకొట్టిన దుండగులు


ఆలయంలోని దుండగులు పగులకొట్టిన హుండీ

ప్రొద్దుటూరు క్రైం : రూరల్ పరిధిలోని రామేశ్వరం బైపాస్ రోడ్డు సమీపంలో ఉన్న గంగమ్మ ఆలయంలో హుండీని గుర్తు తెలియని దుండగులు పగులకొట్టారు. దీంతో ఆదివారం రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఉదయం మొక్కుబడి తీర్చడానికి వచ్చిన భక్తులు చూడగా అప్పటికే హుండీకి తాళం వేసి ఉన్నట్లు చెబుతున్నారు. వారు వెళ్లిన తర్వాత హుండీని పగులకొట్టి ఉండొచ్చని వారు తెలిపారు. కాగా హుండీలో సుమారు రూ. 10 వేల వరకు ఉండొచ్చని స్థానికులు అంటున్నారు. గతంలో మూడు సార్లు ఇదే గుడిలోని హుండీని దొంగలు పగులకొట్టి అందులో ఉన్న డబ్బును దోచుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు యేరువ పెద్దయ్యస్వామి తిరునాల

కలసపాడు : మండలంలోని పాతరామాపురంలో వీరబ్రహ్మేంద్రస్వామి వారి కుమారుడు పోతులూరయ్యస్వామి ప్రియశిష్యుడు శ్రీయేరువ పెద్దయ్యస్వామి తిరునాల సోమవారం నిర్వహిస్తున్నట్లు యేరువ చిన్న పెద్దయ్యస్వామి తెలిపారు. ఉదయం గణపతిపూజ, నవగ్రహ ఆరాధన, స్వామివారి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, అష్టోత్తర శతనామపూజ, హోమములు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాత్రి కలశపూజ, అర్చన, భజనలు, కోలాటం తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. మధ్యాహ్నం నుండి భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

మనోజ్‌కుమార్‌కు సత్కారం


బద్వేలుకు చెందిన మనోజ్‌కుమార్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

బద్వేలు అర్బన్ : బద్వేలుకు చెందిన మహాకవయిత్రి మొల్ల సాహితీపీఠం ప్రధాన కార్యదర్శి గానుగపెంట వెంకట మనోజ్‌కుమార్‌కు ఆదివారం కడపలోని ఐఎంఏ హాలులో ఘనసత్కారం లభించింది. వైఎస్సార్ కడప జిల్లా రచయితల సంఘం మహాసభల సందర్భంగా రెండవ రోజు నిర్వహించిన కవి సమ్మేళనంలో పాల్గొని కడప ఘనతను, రాయలసీమ రసజ్ఞతను చాటుతూ కవితాగానం చేశారు. ఈ సందర్భంగా మనోజ్‌కుమార్‌ను రచయితల సంఘం జిల్లా అధ్యక్షులు ఆచార్య మూలమల్లికార్జునరెడ్డి, ప్రధాన కార్యదర్శి జింకాసుబ్రమణ్యం తదితరులు శాలువా, జ్ఞాపిక, ధృవీకరణపత్రంతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మనోజ్‌కుమార్ మాట్లాడుతూ యువ కవులను ప్రోత్సహించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. కార్యక్రమంలో జిల్లా రచయితల సంఘం బాధ్యులు డాక్టర్ చింతగుంటశివారెడ్డి, డాక్టర్ యల్లాలవెంకటేశ్వరచారి, డాక్టర్ సాయిప్రసాద్, జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన కవులు, రచయితలు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రొద్దుటూరు క్రైం : మండల పరిధిలోని కల్లూరు గ్రామంలో వేర్వేరు చోట్ల నిర్వహిస్తున్న రెండు బెల్ట్ షాపులపై ఆదివారం రూరల్ పోలీసులు దాడులు నిర్వహించారు. దాడిలో సుబ్బరాయుడు వద్ద నుంచి 20 మద్యం బాటిళ్లు, లక్ష్మినారాయణ వద్ద నుంచి 40 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ మహమ్మద్‌రఫి తెలిపారు.

పేకాట స్థావరంపై దాడులు

ప్రొద్దుటూరు క్రైం : మండలంలోని సోములవారిపల్లె శివారు ప్రాంతంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై రూరల్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున పేకాట నిర్వహిస్తున్నారని సమాచారం రావడంతో రూరల్ ఎస్ఐ మహమ్మద్‌రఫి ఆదివారం సాయంత్రం సిబ్బందితో కలసి దాడులు నిర్వహించారు. దాడిలో ఆరుగురు జూదరులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ. 24,460 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అవయవదానంతో పునర్జన్మ

- ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి
- ఉత్సాహంగా 3కే, 5కే రన్ పోటీలు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : అవయవదానంతో పునర్జన్మ లభించినట్లు అవుతుందని, ప్రతి ఒక్కరూ అవయవదానం చేసేందుకు ముందుకు రావాలని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి పిలుపునిచ్చారు. అవయవదానంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రన్ ఫర్ లైఫ్ పేరుతో జమ్మలమడుగు రోడ్డులోని రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద ఆదివారం కొవ్వూరు గ్రాండ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 3కే, 5కే రన్ పోటీల్లో ప్రజలు, క్రీడాకారులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీలను ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొవ్వూరు రమేష్‌రెడ్డి అవయవదానం స్వీకరించి పునర్జన్మ పొందారన్నారు. ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి అవయవదానంపై అవగాహన కల్పించేందుకు విశేష కృషి చేస్తున్నారని కొనియాడారు. అలాగే ప్రజలకు పలు సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, ఆయన ఎంతో శ్రమ, పట్టుదలతో పరుగు పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. కొవ్వూరు గ్రాండ్ చైర్మన్ కొవ్వూరు రమేష్‌రెడ్డి మాట్లాడుతూ 2003లో తనకు కాలేయం సమస్యతో బాధపడుతుంటే స్వప్న అనే యువతి అవయవదానం చేసిందని తెలిపారు. తరువాత 2009లో తనకు కిడ్నీ మార్పిడి జరిగిందన్నారు. గత 22 సంవత్సరాలుగా తాను ఆరోగ్యంగా జీవిస్తున్నానని తెలిపారు. తాను అవయవ దానంపై అవగాహన కల్పించేందుకు ప్రొద్దుటూరు నుంచి తిరుమలకు, తిరుపతి నుంచి విజయవాడకు పాదయాత్ర చేశానన్నారు. 3 కిలోమీటర్లు మహిళల విభాగంలో లక్ష్మీకాంతి ప్రథమ, అవంతిరాణి ద్వితీయ, కల్యాణి తృతీయ, 5 కిలోమీటర్లు పురుషుల విభాగంలో ఆర్.అనిల్‌కుమార్ ప్రథమ, కె.శ్రీను ద్వితీయ, వెంకటరామిరెడ్డి తృతీయ బహుమతులు పొందారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు గ్రాండ్ మేనేజింగ్ డైరెక్టర్ కొవ్వూరు సురేంద్రరెడ్డి, కొవ్వూరు జయమ్మ, వీరేందర్‌రెడ్డి, రోటరీ గవర్నర్ సాధు గోపాలకృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయులు సుధాకర్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, రమణయ్య, మురళి, అహమర్ బాషా, నటకల సతీష్, ఆర్‌సీపీఈ విద్యార్థులు పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ఆరోగ్యం


కార్యక్రమంలో మాట్లాడుతున్న ధ్యానగురువులు పార్థసఖానంద మహరాజ్ స్వామిజీ

బద్వేలు అర్బన్ : ప్రతిరోజూ ధ్యానం చేయడం ద్వారా ఒత్తిడిని జయించడంతో పాటు మానసిక ఆరోగ్యాన్ని పొందవచ్చని ప్రముఖ ధ్యానగురువులు పార్థసఖానంద మహరాజ్ స్వామిజీ తెలిపారు. ఆదివారం స్థానిక నెల్లూరు రోడ్డులోని రాచపూడి నాగభూషణం ఫంక్షన్ హాలులో సామూహిక ధ్యానసాధన అనే అంశంపై అవగాహన కల్పించారు. ప్రతి మనిషి ఏదో ఒక సమయంలో కోపం, ద్వేషం, పగ, చిరాకు, అసూయ వంటి వాటిని అనుభవిస్తుంటారని, వీటన్నింటి వలన కలిగే మానసిక ఇబ్బందులను ధ్యానం ద్వారా దూరం చేయవచ్చని అన్నారు. ముఖ్యంగా విద్యార్థులు ధ్యానం చేయడం ద్వారా వారిలో ఏకాగ్రత పెరిగి మంచి ఫలితాలు సాధించేందుకు వీలవుతుందన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దారు వి.సిద్దేశ్వరయ్య రచించిన ధ్యానానికి తొలిమెట్టు అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాచపూడినాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాల పరిపాలనాధికారి ఆర్.వి.సాయిక్రిష్ణ, రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు అంకయ్య, సహ కార్యదర్శి శశిధర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి నాయకులకు తలొగ్గుతున్న అధికారులు


కూటమి ప్రభుత్వ నాయకులు చదును చేసి సాగు చేసుకుంటున్న చెక్‌డ్యాం


రాత్రికి రాత్రి చదును చేసి సాగు చేసిన ప్రభుత్వ భూమి

బి.కోడూరు : ప్రస్తుతం మండలంలో కూటమి ప్రభుత్వ నాయకులు చెప్పిందే వేదంగా అధికారులు పనిచేస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు మాధవరెడ్డి, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు ఓ.ప్రభాకర్‌రెడ్డిలు తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ మండలంలో వైఎస్సార్‌సీపీ నాయకులే లక్ష్యంగా కూటమి ప్రభుత్వ నాయకులు అధికారులపై ఒత్తిళ్ళు తెస్తూ తప్పుడు ఆరోపణలు, ఫిర్యాదులు చేస్తూ తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని తెలిపారు. అందుకు నిదర్శనమే మండలంలోని మున్నెల్లి గ్రామ పొలంలో కొన్నేళ్లుగా సాగు చేసుకుంటున్న వైఎస్సార్‌సీపీ నాయకులపై కావాల ని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి మండలస్థాయి, డివిజన్ స్థాయి అధికారులపై ఒత్తిళ్ళు తీసుకువచ్చి వైఎస్సార్‌సీపీ నాయకులపై తప్పుడు కేసులు నమోదు చేయిస్తున్నారని పేర్కొన్నారు. మున్నెల్లి గ్రామ పొలంలో కూటమి ప్రభుత్వ నాయకులే ఎక్కువగా ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని యదేచ్ఛగా సాగు చేసుకోవడం కాకుండానే ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకుని సొమ్ము చేసుకోవడం జరుగుతుందన్నారు. అంతేకాకుండా వంకలు, చెక్‌డ్యాంలను సైతం మున్నెల్లి, ఐత్రంపేట పంచాయతీలకు చెందిన కూటమి ప్రభుత్వ నాయకులు చదును చేసి సాగు చేసుకుంటున్నా పట్టించుకునే నాథుడే లేడని, అంతేకాకుండా మున్నెల్లి గ్రామ పొలంలో సర్వే నెంబర్ 324, 325, 285, 38లకు సంబంధించి సుమారు 60 ఎకరాలకు పైగా ఆన్‌లైన్ చేయించుకుని క్రయవిక్రయాలు కూడా జరుపుతున్నా రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారని తెలిపారు. మున్నెల్లి గ్రామపొలంలో చాలా వరకు చెక్‌డ్యాంలు, వంకలు పూర్తిగా మనుమరుగయ్యాయని, రెవెన్యూ అధికారులు, పోలీసు అధికారులకు అవి కనిపించడం లేదా అని, కేవలం వైఎస్సార్‌సీపీ నాయకులే 15 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న భూములు మాత్రమే కనిపించాయా అని రెవెన్యూ, పోలీసు అధికారులను ప్రశ్నించారు.

తల్లి ప్రేమ విలువ తెలిపిన లూర్దుమాత

కడప కల్చరల్ : లూర్దుమాత లోకంలో తల్లి ప్రేమకు గల విలువను ప్రజలందరికీ తెలియజెప్పారని రెవరెండ్ పాదర్‌కాసు లూర్దు అన్నారు. లూర్దుమాత నవదిన కార్యక్రమాల్లో భాగంగా 8వరోజు ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు మరియాపురంలోని పెద్ద చర్చి ఆవరణలో విశేష ప్రార్థనలు చేశారు. తొలుత ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పల్లకీపై లూర్దుమాత స్వరూపాన్ని నిలిపి విశ్వాసులు ఊరేగింపుగా మరియాపురం వీధుల ద్వారా స్తుతి గీతాలు ఆలపిస్తూ ప్రధాన ప్రార్థనా వేదిక వద్దకు చేరుకున్నారు. అక్కడ అమ్మవారిని వేదికపై ప్రతిష్ఠించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పాదర్ కాసు లూర్దు మాట్లాడుతూ లూర్దుమాత కేవలం ప్రభువైన ఏసుక్రీస్తుకు మాత్రమే తల్లి కాదని, తనను విశ్వసించిన వారందరినీ ఆదరించి వారికి తల్లి ప్రేమను పంచి పెట్టారని తెలిపారు. దీనికి స్పందించిన క్రీస్తు తన తల్లి లోకమంతటికీ ప్రేమను పంచిపెట్టడం పట్ల ఎంతో గర్వించారని తెలిపారు. వికర్ జనరల్ తలారి బాలరాజు దివ్య బలిపూజ నిర్వహించారు.

అసంఘటిత కార్మికులకు సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలి

పోరుమామిళ్ల : కార్మిక సంక్షేమబోర్డు ఫలాలు కార్మికులందరికీ అందాలంటే అసంఘటిత కార్మికులకు కూడా సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు భైరవప్రసాద్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక వివేకానంద భవన్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ సమావేశంలో భైరవప్రసాద్ మాట్లాడారు. కార్మికులకు ప్రమాదబీమా రూ. 10 లక్షలు ఇవ్వాలన్నారు. ఉన్నత చదువులు చదివిన వారికి సబ్‌స్టేషన్లలో ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. సమావేశంలో ప్రైవేటు ఎలక్ట్రికల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రఫీ, కన్వీనర్ మాబువలి, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా మృత్యుంజయ హోమం


హోమంలో పూర్ణాహుతిని సమర్పిస్తున్న పండితులు, భక్తులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీఅగస్త్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా స్వామికి విశేష పూజలు చేశారు. వేకువజామున అగస్త్యేశ్వరస్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి కుంకుమార్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం లోకకల్యాణార్థం గణపతి, నవగ్రహ, రుద్ర, మృత్యుంజయ హోమాలను వేద పండితులు నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఈఓ రామచంద్రాచార్యులు, పాలకమండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం


రోగులకు ఉచిత వైద్యం చేస్తున్న వైద్యురాలు

బద్వేలు అర్బన్ : బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ జన్మదినం సందర్భంగా ఆదివారం పట్టణంలో దాసరిశ్రీను ఆసుపత్రిలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆర్.వి.సాయిక్రిష్ణ, వైఎస్సార్‌సీపీ నగర విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బంగారుశీనయ్య, జేసీఎస్ కన్వీనర్ యద్దారెడ్డిలు మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధితో పాటు నియోజకవర్గ అభివృద్ధిలో కూడా తన వంతు పాత్ర పోషిస్తున్న ఎమ్మెల్యేకు ప్రజలందరి ఆశీర్వాదం ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ ఏరియా కన్వీనర్ చెన్నకృష్ణారెడ్డి, వార్డు ఇన్‌చార్జిలు రఘురామిరెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు పాల్గొన్నారు.

నులిపురుగులను నిర్మూలిద్దాం


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

ప్రొద్దుటూరు క్రైం : నులిపురుగులను నిర్మూలించి పిల్లల ఆరోగ్యాన్ని కాపాడుదామని డాక్టర్ నల్లబల్లి హిమబిందు తెలిపారు. సర్వోదయ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం సందర్భంగా వైఎంఆర్ కాలనీలోని పట్టణ ఆరోగ్యకేంద్రంలో ఆదివారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ సోమవారం జరగబోయే జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో పట్టణంలోని 1–19 ఏళ్ల పిల్లలకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తారని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ఈ మాత్రలను పిల్లలకు తినిపిస్తారని తెలిపారు. తల్లిదండ్రులు తప్పకుండా పిల్లలకు మాత్రలను ఇప్పించాలని కోరారు. మాత్రలను మింగించడం ద్వారా రక్తహీనత నుంచి బయటపడొచ్చన్నారు. అనంతరం పురవీధుల్లో ర్యాలీ నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో సిర్డ్ సొసైటీ ప్రెసిడెంట్ ఎంవీ సుబ్బారెడ్డి, హెల్త్ సెక్రటరీలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

భక్తిమార్గాన్ని అలవర్చుకోవాలి


మాట్లాడుతున్న ఆధ్యాత్మిక వేత్త గరికిపాటి గురజాడ

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రతి ఒక్కరూ భక్తి మార్గాన్ని అలవర్చుకోవాలని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త గరికిపాటి గురజాడ పేర్కొన్నారు. మూడు రోజులపాటు అమ్మవారిశాలలో జరిగిన ఆధ్యాత్మిక ప్రవచనాలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. శతక పద్య మకరందం, శ్రీకాళహస్తీశ్వర శతకం, దాశరథి శతకం, శతక పద్య పరమార్థములు అనే అంశాలపై ఆయన ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు ఒక పద్యాన్ని పఠించడం వలన సమస్యలను ఎదుర్కొనే ధైర్యాన్ని పొందవచ్చన్నారు. శ్రీకాళహస్తీశ్వర శతకం చదవడం ద్వారా జ్ఞాన, వైరాగ్యాలు అలవడుతాయని, దాశరథి శతకం ద్వారా భక్తి మార్గం అలవడుతాయని తెలిపారు. ఈ సందర్భంగా గరికపాటి గురజాడను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్యసభ అధ్యక్షుడు బుశెట్టి రాంమోహన్‌రావు, కార్యదర్శి మురికి నాగేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనం నడిపితే అరెస్ట్ చేస్తాం

పోరుమామిళ్ల : మద్యం సేవించి ద్విచక్ర వాహనం నడుపుతున్న ఇద్దరు వ్యక్తులను పట్టణంలోని వరికుంట్ల బస్టాఫ్ వద్ద అరెస్టు చేసి వారిపై కేసు నమోదు చేసి, వాహనాలు సీజ్ చేసినట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు.